క్లుప్తంగా

## పైడితల్లి సేవలో గోవా గవర్నర్



అమ్మవారిని దర్శించుకుంటున్న గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు దంపతులు

**విజయనగరం టౌన్:** ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీపైడితల్లిని గోవా రాష్ట్ర గవర్నర్, ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు సోమవారం దర్శించుకున్నారు. గవర్నర్‌గా బాధ్యతలుగా స్వీకరించినానంతరం తొలిసారిగా జిల్లాకు విచ్చేసిన ఆయన సతీసమేతంగా అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు ఆయనకు అధికారిక లాంఛనాలతో స్వాగతం పలికి, వేదాశీస్సులు, అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ కె.శిరీష, సూపరింటెండెంట్ వైవీ రమణి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

**భోగాపురం:** తగరపువలసలో కొత్తగా నిర్మిస్తున్న ఉమారామలింగేశ్వర, అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ మేరకు మండలంలోని పోలిపల్లి గ్రామంలోని తన స్వగృహంలో ఆలయ కమిటీ సభ్యులకు ఆయన విరాళం డబ్బులు సోమవారం అందజేశారు.

## గణనాథుని చెంత అక్షరాభ్యాసం



వినాయకుడి విగ్రహం వద్ద చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

**విజయనగరం టౌన్:** నగరంలోని 50వ డివిజన్ వైఎస్సార్ నగర్‌లో ఏర్పాటు చేసిన బాలాపూర్ మూవింగ్ గణేశుని వద్ద పలువురు చిన్నారులు అక్షరాభ్యాసానికి సోమవారం శ్రీకారం చుట్టారు. ఇక్కడి గణపతి విగ్రహం చెవులు ఊగడం, కళ్లు తెరవడం ఆటోమేటిగ్గా జరుగుతుంటుంది. ఈ నేపథ్యంలో చిన్నారులను దీవించి, మంచి విద్యాబుద్ధులు ప్రసాదించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరినప్పుడు గణనాథుడు చెవులు ఊగడాన్ని దీవెనలుగా స్వీకరించి, ఆనందించారు.

## రాష్ట్రంలో దళితులకు రక్షణ కరువు

**నెల్లిమర్ల రూరల్:** రాష్ట్రంలోని దళితులకు రక్షణ కరువైందని, ఎక్కడపడితే అక్కడ దళితులపై అన్యాయంగా దాడులు జరుగుతుండడం అన్యాయమని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు ఓ ప్రకటనలో సోమవారం ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలోని దుర్గ సముద్రంలో జరిగిన వినాయక నిమజ్జనంలో టీడీపీ కార్యకర్తలు దళితులపై భౌతికదాడులకు పాల్పడడం విచారకరమన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

**విజయనగరం క్రైమ్:** ప్రతిఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఈగల్ టీమ్ అధికారి విజయ్‌కుమార్ సూచించారు. స్థానిక ఎస్‌కేడీ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, మద్యం, సిగరెట్ వంటి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని, అందరూ మంచి అలవాట్లు అలవాటు చేసుకుని ఆదర్శంతమైన జీవనం సాగించాలని ఆకాంక్షించారు.

## దర్యాప్తు చేస్తున్నాం..

**విజయనగరం క్రైమ్:** ఇంజినీరింగ్ చదువుతున్న యువతిని ఇన్‌స్టాగామ్‌లో ఓ యువకుడు వేధిస్తున్నారంటూ తండ్రి వేణు గత నెల 29న ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు కొనసాగుతోందని వన్‌టౌన్ ఏఎస్‌ఐ జగన్మోహన్ రావు సోమవారం తెలిపారు. నిందితుడిని గుర్తించామని, సీఐ ఆర్వీకే చౌదరి స్వయంగా కేసును దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ చెప్పారు. ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేశామన్నారు.

## రిజిస్ట్రేషన్ చేసుకోండి

**విజయనగరంఫోర్ట్:** జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులంతా వైద్యారోగ్య శాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.జీవనరాణి ప్రకటనలో సోమవారం కోరారు. ఫెర్టిలిటీ సెంటర్లు రిజిస్ట్రేషన్ కోసం నేషనల్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

# బిక్కు బిక్కు..

- శిథిలావస్థలో పోలిపల్లి పశువైద్య శాల
- భయంతో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- కొత్త భవనం నిర్మించాలని డిమాండ్



శిథిలావస్థలో పోలిపల్లి పశువైద్య శాల

**భోగాపురం:** మండలంలోని పోలిపల్లి పశువైద్య శాల ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో అందులోని సిబ్బంది బిక్కుబిక్కుమని విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలోని రాజాపులోవ, చెరుకుపల్లి, గుడివాడ, రావాడ, సవరవిల్లి, తూడెం, కవులవాడ తదితర గ్రామాల పాడిరైతులు, పశుపోషకులంతా తమ పశువులను వైద్యానికి ఇక్కడకే తరలిస్తుంటారు. అంతటి ప్రాధాన్యమున్న ఈ పశువుల ఆస్పత్రి ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. శ్లాబు పెచ్చులూడిపోయి అధ్వానంగా కనిపిస్తోంది. ఏ చిన్నపాటి వర్షం కురిసినా పెచ్చులూడిన శ్లాబు నుంచి వర్షపు నీరు ఆస్పత్రి గదిలోకి వచ్చేస్తోంది. దీనివల్ల సిబ్బంది విధులకు ఆటంకం కలగడమే కాకుండా పశువైద్యానికి తీసుకువచ్చి భద్రపరిచిన మందులు తడిచిపోతున్నాయని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడే కొన్నాళ్ల క్రితం నిర్మించిన బాత్‌రూమ్‌కు నీటి సదుపాయం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో కనీసం చేతిపంపు(బోరు) కూడా లేకపోవడం దారుణమని అటు సిబ్బంది, ఇటు రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నీటి వసతి లేకుంటే పశువైద్యం తర్వాత చేతులు ఎక్కడ కడుక్కోవాలని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త భవనం నిర్మించాలని కోరుతున్నారు.



గది లోపల పెచ్చులూడిన శ్లాబ్

### నీటి సదుపాయం కల్పించాలి..

కొత్త పశువైద్య శాల భవనం కట్టడమే కాకుండా భవనం చుట్టూ ప్రహరీ నిర్మించాలి. అలాగే చేతులు, ఆపరేషన్ సామగ్రి కడుక్కోవడానికి వీలుగా ఆస్పత్రి ఆవరణలో బోరు వేయాలి. నీటి సదుపాయం లేకపోవడంతో వైద్యసేవల తర్వాత చేతులు, కాళ్లు శుభ్రం చేసుకోలేకపోతున్నాం.

– చందక సన్యాసి, రైతు, రాజాపులోవ గ్రామం



వర్షానికి తడిసిపోతున్న మందులు

### వర్షం నీరు వచ్చేస్తోంది..



చిన్నపాటి వాన పడితే చాలు.. ఆ వర్షం నీరంతా ఆస్పత్రి గదుల్లోనే ఉంటోంది. తమకు..మందులు భద్రపరిచేందుకు ఇబ్బందికర వాతావరణం నెలకొంది. ఈ విషయాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులకు తెలియజేశాం. కొత్త భవనం మంజూరు చేయాలని కోరాం.

– డి.కమలకుమారి, పశువైద్యాధికారి, పోలిపల్లి గ్రామం

## హుద్‌హుద్ ఇళ్ల లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలి



బాధితులతో కలిసి ధర్నా చేస్తున్న అంబేడ్కర్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు భానుమూర్తి

**విజయనగరంఫోర్ట్:** హుద్‌హుద్ ఇళ్ల లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలని అంబేడ్కర్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు బుంగా భానుమూర్తి డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన బాధితులతో కలిసి కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. 2014 అక్టోబరు 12న వచ్చిన హుద్‌హుద్ తుపాను ధాటికి పట్టణంలోని యబొంగవీధి, అశోక్‌నగర్ ప్రజలు ఇళ్లు కోల్పోయి నిర్వాసితులుగా మారారని, అప్పట్లో వారికి విజయనగరంలోని లంకాపట్నం 19వ డివిజన్‌లో గృహ సముదాయం ఇళ్లను కేటాయించడం జరిగిందన్నారు. ఇదంతా జరిగి పదేళ్లవుతున్నా వారికి తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సత్యనారాయణ, ఎర్రమ్మ, సింహాద్రి, పార్వతి, నూకాలమ్మ, మైసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రెండు రోజుల పాటు తాగునీటి సరఫరా నిలుపుదల



తాగునీటి పైపులైన్ లీకేజీని పరిశీలిస్తున్న కమిషనర్ జయరాం

**నెల్లిమర్ల:** నగరపంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని కమిషనర్ టి.జయరాం తెలిపారు. స్థానిక రైల్వేట్రాక్ సమీపంలో మరమ్మతులకు గురైన తాగునీటి పైపులైన్‌ను ఆయన సోమవారం పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలోని 130 కేఎల్ రిజర్వాయరుకు నీటిని పంపింగ్ చేసే పైపు బద్దలైందని, 5,6,10 వార్డుల పరిధిలోని అగురు వీధి, జంగాల, సువ్వాన, యాత, ఎరుకుల వీధులు సహా నాయుడు కాలనీకి రెండు రోజుల పాటు కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేయలేమన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**నెల్లిమర్ల రూరల్:** మండలంలోని సతివాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ డీఈఈ త్రినాధరావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. విద్యుత్ మరమ్మతు పనుల నేపథ్యంలో అలుగోలు, గుషిణి, చనమళ్లపేట, బర్లపేట, కొత్తూరు, పల్లిపేట, జోగిరాజుపేట, రాగోలు గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## బీసీల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న బీసీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు

**విజయనగరం టౌన్:** బీసీల సమస్యల పరిష్కారానికి సంఘ సభ్యులంతా కృషి చేయాలని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.శంకరరావు కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో కొత్తగా ఎన్నికైన సంఘ సభ్యులకు నియామకపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామాన బీసీల జెండా ఎగురవేయాలని, బీసీల ఐక్యతకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కొత్త అధ్యక్షుడు గదుల వెంకటరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె సూరిబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు తోటపల్లి బుజ్జిబాబు, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు హరిప్రసాద్, ప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రూ.59.70 లక్షలతో పైడితల్లి జాతర ఏర్పాట్లు



కమిషనర్ పల్లి నల్లనయ్య

**విజయనగరం:** ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, విజయనగరవాసుల ఇలవేల్పు పైడితల్లి జాతర మహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఇదే విషయమై ఆయన స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. అక్టోబరు 6,7,8 తేదీల్లో ఉత్సవాల నిర్వహణకు జిల్లా యంత్రాంగం నిర్ణయించడం జరిగిందని, ఈ మేరకు రూ.59.70 లక్షల వ్యయంతో పండగ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రూ.1.85 లక్షలతో పండగ జరిగే మూడు రోజుల్లో నగర ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని, మరో రూ.4.20 లక్షలతో ప్రధాన జంక్షన్లు ఇతర ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు చేయడం జరుగుతుందని, రూ.9.70 లక్షలతో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తామని, రూ.10.65 లక్షలతో నగరంలోని సెంట్రల్ డివైడర్లకు రంగులు వేస్తామన్నారు. రూ.16 లక్షలతో పలు ప్రాంతాల్లో విద్యుత్ దీపాలంకరణలు, రూ.4.60 లక్షలతో డివైడర్‌లకు రోప్ లైటింగ్, రూ.3.20 లోలతో జనరేటర్లు, ఫ్లడ్‌లైట్లను అద్దె ప్రాతిపదికన ఏర్పాటు చేయనున్నామన్నారు. రూ.5 లక్షలతో పండగ రోజుల్లో మూడు షిఫ్టులుగా పని చేసేందుకు 300 మంది ప్రత్యేక పారిశుధ్య కార్మికులను తీసుకుంటామన్నారు. రూ.4.50 లక్షలతో ప్రత్యేక పారిశుధ్య పనిముట్లు, ఇతర సామగ్రి కొనుగోలు చేస్తామన్నారు. ప్రజలు, అధికారులంతా సహకరించి, ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

## జగనన్న కాలనీల్లో.. మౌలిక సదుపాయాలు కల్పించండి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, జగనన్న కాలనీవాసులు

**విజయనగరం గంటస్తంభం:** జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జామి మండల కేంద్రంలోని జగనన్న కాలనీల్లోని ఇళ్లకు కనీసం విద్యుత్ సదుపాయం లేదని, అలాగే మంచినీటి కుళాయిలు, రోడ్లు, కాలువలు వంటి సౌకర్యాలేవీ లేవన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్లకు సౌకర్యాలు కల్పించకూడదన్న రూల్ ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. పార్టీలకు అతీతంగా ప్రజలకు మంచి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నెయ్యిలవీధి జగనన్న కాలనీ ప్రజల సమస్యల పరిష్కారం అయ్యేంతవరకు సీపీఐ వారికి అండగా ఉండి పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో దేగల అప్పలరాజు, జగనన్న కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎల్ఐసీ ఆవిర్భావ దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీబీ సీఈవో ఉమామహేశ్వరరావు తదితరులు

**విజయనగరం:** నగరంలోని ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయంలో ఎల్ఐసీ 69వ ఆవిర్భావ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. డీసీసీబీ సీఈవో సీహెచ్ ఉమామహేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాలసీదారులకు మెరుగైన సేవలందించడంలో ఎల్ఐసీ ఎప్పుడూ ముందంజలోనే ఉందన్నారు. ప్రజల నమ్మకం, ఆదరణతోనే ఈ 69 ఏళ్ల విజయం సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో సీనియర్ బ్రాంచి మేనేజర్ ఎస్.జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## 10 నుంచి ప్రత్యేక ఆరాధనలు

**విజయనగరం టౌన్:** నగరంలోని అతిపురాతనమైన చర్చిగా పేరొందిన ఎస్ఎంబీ(సిమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్) చర్చి 150 వసంతాల వేడుక పురస్కరించుకుని, ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక ఆరాధనలు ఉంటాయని నిర్వాహకులు ఆర్.ఎస్.జాన్ తెలిపారు. ఇదే విషయమై చర్చి ఆవరణలో పలు సంఘాల దైవజనులతో సన్నాహక సమావేశం సోమవారం నిర్వహించారు. చర్చి ఆవిర్భవించి ఈ నెల 10వ తేదీన 140 వసంతాలు పూర్తి చేసుకుని 150వ వసంతంలోకి అడుగిడుతున్న నేపథ్యంలో ఈ ప్రత్యేక ఆరాధనలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

## చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

- వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి

**విజయనగరం:** చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, ఆయన ఎన్నికలకు ముందు ఓ మాట..ఎన్నికలైన తర్వాత మరోమాట మాట్లాడి ప్రజలను మోసగిస్తారని ఇదే ఆయనకు అలవాటుగా మారిపోయిందని ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి విమర్శించారు. నగరంలోని హోటల్ వీఆర్ గ్రాండ్‌లో వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం సోమవారం జరిగింది. పార్టీ మండల అధ్యక్షుడు కెల్ల త్రినాథ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఆయన కాసేపు ప్రసంగించారు. సొంతమామ అయిన ఎన్టీఆర్‌కే వెన్నుపోటు పొడిచి పార్టీని లాక్కున్న వ్యక్తికి ప్రజలను మోసగించడం పెద్ద పనేం కాదన్నారు. అధికారం కోసం ఆయన ఎన్ని అడ్డదారులైనా తొక్కుతారని మండిపడ్డారు. అవసరమైతే దేశంలోని అన్ని పార్టీలతోనూ జట్టు కట్టేస్తారని, అదే అవసరం తీరాక వదిలేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్యన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చి 14 నెలల కాలం దాటినా ఎన్నికల హామీలన్నీ అమలు చేయకుండా ప్రజలను నయవంచన చేస్తున్నారన్నారు. కూటమి మోసపూరిత పాలనను ప్రజలకు వివరించి చైతన్యం కల్పించడమే లక్ష్యంగా నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. ఇప్పటి వరకు కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్లు, మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఎక్కడకు వెళ్లినా చంద్రబాబు అది ఇస్తామన్నారు..ఇది ఇస్తామన్నారు ఏదీ ఇవ్వడం లేదన్న స్పందన ప్రజల నుంచి వచ్చిందన్నారు. కూటమి అధికారం చేపట్టాక ఒక్క కొత్త పింఛన్ అందివ్వలేదని, పైగా ఉన్న పింఛన్లు తొలగిస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటివరకు అమలు చేసిన పథకాల్లోనూ చాలామంది అర్హులకు అన్యాయం జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో కుల,మత,రాజకీయ పార్టీలకు అతీతంగా అన్నివర్గాలకు మేలు చేస్తూ పథకాలు అందివ్వడం జరిగిందని గుర్తు చేశారు. కూటమి అన్యాయాలు, అక్రమాలను ప్రశ్నించిన వారిపై కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని, లేనిపోని కేసులు పెట్టి వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ సంస్కృతి మంచిది కాదని హితవుపలికారు. భవిష్యత్ అంతా వైఎస్సార్ సీపీదేనని, రాబోయే ఏ ఎన్నికల్లో అయినా మన వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని పార్టీ నాయకులను కోరారు.



సమావేశానికి హాజరైన మండల స్థాయి వైఎస్సార్ సీపీ నాయకులు

### మహిళలకు రక్షణ లేదు..

కూటమి ప్రభుత్వం గొప్ప పరిపాలన అందిస్తే ప్రభుత్వ కార్యక్రమాలకు బలవంతంగా జనాలను తరలించడం ఎందుకని విజయనగరం నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఓట్లు కోసం రాష్ట్రంలో 30 వేల మంది మహిళలు కనిపించడం లేదని పవన్‌కల్యాణ్ ఆరోపణలు చేశారని, ఆయన ఇప్పుడు అధికారంలో ఉండి ఏం చేస్తున్నారని నిలదీశారు. ఓట్లు కోసం జనానికి ఏమైనా చెప్పి నమ్మించవచ్చనడానికి ఆయన మాటలే నిదర్శనమన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాతనే రాష్ట్రంలో మహిళలపై దాడులు ఎక్కువయ్యాయని, మహిళలకు రక్షణ లేదన్నారు.

### 143 హామీలు ఇచ్చారు..అవేవీ?

ఎన్నికలప్పుడు కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలే కాకుండా నారా లోకేష్ తన పాదయాత్రలో మొత్తం 143 హామీలిచ్చారని అవెక్కడ అని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కెల్ల త్రినాథ్‌లు ప్రశ్నించారు. వాటిని ఎప్పుడు అమలు చేస్తారని నిలదీశారు. సూపర్ సిక్స్‌లోని పథకాలే పూర్తిగా అమలు చేయలేదని, మిగతా పథకాలు ఎప్పుడు ఇస్తారన్నారు. ప్రజలు ఇప్పుడిప్పుడే నిజనిజాలు గ్రహిస్తున్నారని, వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన మేలను గుర్తు చేసుకుంటున్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా పెన్షనర్ల, ఉద్యోగుల విభాగం అధ్యక్షుడు డోల మన్మథకుమార్, వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కిలారి రాంబాబు, కార్యదర్శి కునుకు నాగరాజు, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు గొర్లె సూర్యకళ, మండల ప్రధాన కార్యదర్శి గంగిరెడ్ల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణకు రైతులు హాజరుకావాలి

**భోగాపురం:** ప్రపంచ కొబ్బరి దినోత్సవం సందర్భంగా పూసపాటిరేగ మండలం, చింతపల్లిలో రైతులకు మంగళవారం శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, రైతులంతా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఉద్యానవన శాఖాధికారిణి బి.ఉమాభరణి ఓ ప్రకటనలో సోమవారం కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన పంటలు వేసే రైతులకు కొబ్బరి తోటలో అంతర పంటలు ఏ విధంగా సాగు చేయాలి, వా టిలో చేపట్టాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యలు, ఉద్యాన శాఖ అలాగే కొబ్బరి అభివృద్ధి బోర్డు ద్వారా అమలు చేస్తున్న పథకాలు, రాయితీల వివరాలు తెలియజేయనున్నామన్నారు.

## 5 నుంచి యువజనోత్సవాలు

**విజయనగరం:** నగరంలో ఈ నెల 5వ తేదీ నుంచి విజయనగరం రోటరీ మెయిన్ క్లబ్ యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ యూత్ సర్వీస్ డైరెక్టర్ బి.హేమకుమార్ తెలిపారు. సోమవారం ఉత్సవాల కరపత్రాలను నగరంలో ఆవిష్కరించారు. నెలరోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

## నేడు వైఎస్సార్ వర్ధంతి

**నెల్లిమర్ల రూరల్:** మండల కేంద్రంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్(వైఎస్ రాజశేఖరరెడ్డి) వర్ధంతి మంగళవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గదల సన్యాసినాయుడు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో మొయిద, రామతీర్థం జంక్షన్లలోని మహానేత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందన్నారు. పార్టీ శ్రేణులంతా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

**పూసపాటిరేగ:** మండలంలోని కుమిలి గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి మంగళవారం నిర్వహిస్తున్నామని, పార్టీ నాయకులు, కార్యకర్తలంతా హాజరుకావాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు ఓ ప్రకటనలో సోమవారం కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా పేదలకు పండ్లు, రొట్టెలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

**డెంకాడ:** మండలంలోని పెదతాడివాడలో దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి మంగళవారం నిర్వహిస్తున్నామని, అందరూ హాజరుకావాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పిన్నింటి తమ్మునాయుడు కోరారు.